క్లుప్తంగా

జగనన్న పాలనలో వ్యవసాయానికి ప్రాధాన్యం

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని వ్యవసాయానికి తగిన ప్రాధాన్యం లభిస్తోందని మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. తణుకువాడ రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ ఆధునిక పద్ధతులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యమిస్తోందన్నారు. స్థానిక సీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్‌లు దెయ్యాల వెంకటరమణ, వాసంశెట్టి శ్రీనివాస్, పితాని ఆదినారాయణ, మాజీ ఉప సర్పంచ్ పితాని సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



సీతారామక్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద వేంచేసియున్న శ్రీ సీతారామక్షేత్రంలో ధనుర్మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. 14వ తేదీన గోదాదేవి కల్యాణోత్సవం సందర్భంగా మంగళవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మంగళస్నానం, తిరుప్పావై నిర్వహించారు. శ్రీసీతారాముల వారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు, అభిషేకాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్థానిక మహిళ భక్తులు విష్ణుసహస్రనామ పారాయణ చేశారు. సీతారామక్షేత్రంలో గోదాదేవి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ వేడుకల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు కోరారు.

ఆర్బీకే నిర్మాణ పనుల పరిశీలన

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రికలో ఆర్బీకే భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. భవన నిర్మాణానికి రూ.28 లక్షలు మంజూరుకాగా మంగళవారం పునాది నిర్మాణ పనులు చేపట్టారు. మండల ఇంజినీరింగ్ అధికారి డీవీ రాఘవులు పర్యవేక్షణలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పట్టా తేజశ్విని ఆధ్వర్యంలో పనులు సాగుతున్నాయి. అధికారులు, సర్పంచ్ తిరునాతి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్బీకే నిర్మాణంతో గ్రామంలో సాగు ప్రక్రియ మరింత సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంగా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు నేల సూర్యకుమార్ పాల్గొన్నారు.

ఆర్‌బీకేల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రమణమూర్తి

కె.గంగవరం: దాళ్వా పంటకు సంబంధించి ప్రతి రైతు ఆర్బీకే వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి గుర్రాల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు ఏపీ రమణమూర్తి సూచించారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో బుధవారం బీజేపీ కిసాన్ మోర్చ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఎరువులు అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కిసాన్ మోర్చ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులలో కొత్తవారిని నియమించి వారిని అభినందించారు. మండల ఉపాధ్యక్షులు అర్జున్, జిల్లా కార్యవర్గ సభ్యులు సలాది వీర వెంకట సత్యనారాయణ, నాయకులు రామకృష్ణ, వెంకట్రావు పాల్గొన్నారు.

ఘనంగా రంగోలి పోటీలు

మండపేట: పట్టణంలోని ఎస్‌వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం రంగోలి పోటీలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని రంగవల్లులు వేశారు. భోగిమంటలు వేసి సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పోటీల్లోని విజేతలకు ప్రిన్సిపాల్ విశ్వనాథశర్మ, అధ్యాపకులు బహుమతులు అందజేశారు.

పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలి

రాయవరం: పారిశుద్యం మెరుగుదలకు ప్రజలకు సహకరించాలని మండలంలోని సోమేశ్వరం సర్పంచ్ ఆరిఫ్ కోరారు. గ్రామంలో మంగళవారం మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా హైపోక్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే దోమలు అధికంగా ప్రబలడానికి మురుగునీరు, అపరిశుభ్ర వాతావరణం కారణమన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా ప్రజలు పంచాయతీకి సహకరించాలన్నారు.

దేవతలారా దీవించండి

- జాతర్లకు సిద్ధమవుతున్న పల్లెలు
- వివిధ గ్రామాల్లో తీర్థాల హడావుడి



సోమేశ్వరంలోని చినతలుపులమ్మ తల్లి

రాయవరం: సంక్రాంతి వేళ పల్లెలు జాతర్లకు సిద్ధమవుతున్నాయి. ఏటా గ్రామదేవతలకు ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఏడాదిలో ఏదో ఒక రోజు గ్రామదేవతల ఉత్సవాలను నిర్వహించినా, అధికంగా సంక్రాంతికి గ్రామ దేవతలకు ఉత్సవాలను నిర్వహిస్తారు. అందులో భాగంగా మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల్లోని వివిధ గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఆశీర్వచనాలు అందించే ఆసాదులు

గ్రామ దేవతలకు భక్తులు పసుపు, కుంకుమ చెల్లించి మొక్కులు తీర్చుకుంటారు. గ్రామదేవతలను గరగల రూపంలో రోజూ ఊరేగించి పెద్ద పండగ రోజున ఉత్సవం నిర్వహించి కనుమ పండుగ రోజున తీర్థం జరుపుతారు. గరగలను ఎత్తుకుని వచ్చే వారి కాళ్లను పసుపునీళ్లతో కడిగి గరగకు పసుపు, కుంకుమతో పాటు హారతులు ఇస్తారు. రోజు విడిచి రోజు ఇలా గరగలను ఎత్తుకుని డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గరగలను ఎత్తుకునే ఆసాదులు ప్రజలకు ఆశీర్వచనాలు అందజేస్తారు.

ఇదీ పరిస్థితి..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట మండలం కేశవరంలో గని పోతురాజు జాతరను సంక్రాంతికి ఘనంగా నిర్వహిస్తారు. రాయవరం మండలంలో పలు గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమేశ్వరం గ్రామ పరిధిలో ఉన్న చిన తలుపులమ్మలోవలో పెద్దపండగ రోజున జాతరతో పాటు కనుమ రోజున తీర్థం, సోమేశ్వరంలో కనుమరోజు దేవాంగులపేటలో పోతురాజు తీర్థం, లొల్లలో కనుమరోజు రాత్రి బులిబాపనమ్మ, గోగులమ్మకు జాతరను నిర్వహించనున్నారు. కనుమరోజున కూర్మాపురంలోని చెరువు వద్ద గ్రామదేవత పోలేరమ్మ తీర్థం, చెల్లూరులో పెద్దపండగ రోజున మద్దెమ్మతల్లి, ముక్కనుమ రోజున సత్తెమ్మతల్లి తీర్థం జరగనున్నాయి. కె.గంగవరం మండలంలోని శివల, కపిలేశ్వరపురం మండలంలోని కపిలేశ్వరపురం, మాచర, పడమరఖండ్రిక గ్రామాల్లో ప్రభల తీర్థం జరుగుతాయి. మూడు గ్రామాల్లో ప్రభలకు ఊరేగింపు నిర్వహిస్తారు. మాచర గ్రామ శివారు శ్రీరామపురానికి ప్రభలు చేరతాయి. అక్కడే తీర్థాన్ని నిర్వహిస్తారు. భక్తులు ప్రభలకు మొక్కులు తీర్చుకుంటారు. అంగరలో రాజ్యలక్ష్మీదేవి, పడమరఖండ్రికలో పోశమ్మ, మాచరమట్టలులో గొల్లాలమ్మ జాతరలు నిర్వహిస్తారు. సంక్రాంతి మూడు రోజులు ధనమ్మమర్రిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. పలు గ్రామాల్లో నిర్వహించే గ్రామదేవతల సంబరాలకు గ్రామాలు ముస్తాబవుతున్నాయి.



శివలలో సిద్ధం చేసిన ప్రభ



కేశవరంలోని పోతరాజుస్వామి

బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయం



రామచంద్రపురంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పథకాలను వివరిస్తున్న మంత్రి వేణు

మంత్రి వేణు

రామచంద్రపురం: బడుగు బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా అవినీతి లేని పాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 10వ గ్రామ సచివాలయం పరిధిలో 23వ వార్డులో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందుకున్న లబ్ధిని చదివి వివరించారు. సచివాలయ పరిధిలో గల సమస్యలను ప్రజలు వివరించగా వాటి పరిష్కరించాలని అధికారులను మంత్రి వేణు ఆదేశించారు. ఈ సందర్భంగా 23వార్డులో డ్రైనేజీ సమస్య ఉందని మురుగునీరు కిందకు వెళ్లకపోవటంతో పలు ఇబ్బందులకు గురవుతున్నామని మంత్రికి స్థానికులు వివరించారు. రోడ్లపై చెత్తను శుభ్రం చేయటంలేదని తెలిపారు. దీనికి మంత్రి వేణు స్పందిస్తూ సమస్యను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ టి.శ్రీకాంత్‌రెడ్డిని ఆదేశించారు. పెన్షన్, ఇంటి స్థలం మంజూరు కాని వారికి అర్హతను బట్టి మంజూరు చేస్తామని మంత్రి చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, స్థానిక వార్డు కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్ కేతా శ్రీను, పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు కొండేపూడి సురేష్, అక్కల తాగూర్ పాల్గొన్నారు.

అవినీతికి తావు లేకుండా సంక్షేమం

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి తావులేకుండా, సంక్షేమం నేరుగా ప్రజలకు అందేలా వినూత్న రీతిలో చర్యలు చేపట్టారని రాష్ట్ర బీసీ సంక్షేమ సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కాపవరంలో గ్రామ సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్, సొసైటీ చైర్మన్ గీసాల శివలతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమాన్ని బ్రోచర్‌ల ద్వారా వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తూ మంత్రి వేణు ముందుకు సాగారు. జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, మండల, గ్రామ స్థాయి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కాపవరంలో వృద్ధుడికి బ్రోచర్ అందించి వివరిస్తున్న మంత్రి వేణు

క్షయ నిర్మూలనకు సహకరించాలి



సర్వే తీరును పరిశీలిస్తున్న వైద్య బృందం

మండపేట: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీకి చెందిన వైద్యురాలు పి.సుజాత అన్నారు. క్షయ వ్యాధిపై మండలంలోని ద్వారపూడి శివారు వేములపల్లిలో జరుగుతున్న సబ్ నేషనల్ సర్టిఫికేషన్ (ఎస్ఎన్‌సీ) సర్వే తీరును మంగళవారం సుజాత నేతృత్వంలోని ప్రత్యేక బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ సర్వేను నిర్వహిస్తున్నాయన్నారు. అందులో భాగంగా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వ్యాధిగ్రస్తులు పూర్తి ఆరోగ్యంతో కోలుకునే వరకు అవసరమైన వైద్యసాయం అందిస్తామన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. వైద్యులు సూర్యనారాయణ, నారాయణరెడ్డి, జగదీష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీరు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపాలెం, తోటపేట, వెల్ల గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఒక్కొక్క వలంటీరు పోస్టు భర్తీకి జిల్లా జాయింట్ కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు రామచంద్రపురం మండల ఎంపీడీఓ ఎన్. కీర్తి స్పందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే గ్రామానికి చెందిన, 18 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండి, 10 వ తరగతి పూర్తి చేసిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 11 నుంచి 13 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు.

కె.గంగవరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఎన్. శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.గంగవరం మండల పరిధిలోని బ్రహ్మపురి – 1, శివల – 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని దరఖాస్తులు ఆన్‌లైన్‌లో బుధవారం నుంచి స్వీకరిస్తారన్నారు. ఈ నెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వం నియమించిన కమిటీ ద్వారా మౌఖిక పరీక్ష నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తామని చెప్పారు.

రాయవరం: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీవో డి.శ్రీనివాసు మంగళవారం విలేకరులకు తెలిపారు. మాచవరం ఒకటి, సోమేశ్వరంలో రెండు వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈ నెల 13వ తేదీలోగా పంపించాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో రాంబాబు

మండపేట: రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో సత్తా చాటి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్‌కు మంచి గుర్తింపు తీసుకురావాలని పట్టణ ప్రముఖుడు వంక సాయిరాంబాబు క్రీడాకారులకు సూచించారు. పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల నుంచి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన 10 మంది క్రీడాకారులకు టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా మండపేటలో శిక్షణ ఇస్తున్నారు. వారికి పట్టణ ప్రముఖులు వేగుళ్ల చైతన్యబాబు, వంక సాయిరాంబాబు భోజన వసతి కల్పించారు. మంగళవారం జరిగిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అభినందనలు తెలిపారు. క్రీడాకారులు రాంబాబును సత్కరించారు. బుధవారం నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని టెన్నికాయిట్ క్లబ్ ఆర్గనైజర్, కోచ్ కుంచె రమేష్ తెలిపారు.

గ్రంథాలయ నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మండపేట: మండలంలోని ఏడిదలో నిర్మిస్తున్న గ్రంథాలయ నిర్మాణ పనులను మంగళవారం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పరిశీలించారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం రూ.38 లక్షలు వెచ్చించి తన తల్లిదండ్రుల పేరిట గ్రంథాలయ భవనాన్ని నిర్మిస్తున్నారని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం తెలిపారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణ పనుల కోసం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాతో మాట్లాడి అనుమతులు మంజూరు చేయించారన్నారు. గ్రామం నడిబొడ్డున అందరికీ అందుబాటులో ఉండే విధంగా గ్రామ కచేరీ ప్రాంగణంలో గ్రంథాలయ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు చొల్లంగి రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కుడిపూడి రాంబాబు, పలివెల సుధాకర్, విసువురెడ్డి శివ, పరమట తరుణ్ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

కె.గంగవరం: గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు డాక్టర్లు, సిబ్బంది మెరుగైన వైద్యం అందించాలని అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ పంపన నాగమణి సూచించారు. మండల పరిధిలోని పామర్రు పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి పెద్ద పీట వేసిందన్నారు. దీనిలో భాగంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని విస్తరించిందని ప్రతి పీహెచ్‌సీని 24 గంటల సేవల ఆసుపత్రిగా మార్చిందన్నారు. ఇప్పటికే రూ.1. 50 లక్షలతో నూతన పీహెచ్‌సీ భవనం నిర్మించామని, త్వరలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆసుపత్రికి కావల్సిన కంప్యూటర్లు, ఇతర సామగ్రి కొనుగోలుపై తీర్మానాలు చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు నానాపరపు కళ్యాణి, వాసంశెట్టి సూరిబాబు పాల్గొన్నారు.

ప్రభల తీర్థం నిర్వహణపై సమావేశం

అయినవిల్లి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని అయినవిల్లి, ముక్తేశ్వరం, తొత్తరమూడి, మడుపల్లి, వీరవల్లిపాలెం, కె.జగన్నాథపురం తదితర గ్రామాల్లో ప్రభల తీర్థం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో చేసే ఏర్పాట్లపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ అధ్యక్షతన మంగళవారం వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో తీర్థం నిర్వహించాలని, అన్ని శాఖలు సహకరించాలని కోరారు. జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ కాకర శ్రీనివాస్, విఘ్నేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు, ఈఓ ఎం.సత్యనారాయణరాజు తదితరులు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్‌కు వెండి పతకం

రాజోలు: ఫొటోగ్రాఫర్లు ఈ నెల 5, 6 తేదీల్లో పాపికొండలులో నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో పొదలాడకు చెందిన ఫొటోగ్రాఫర్ కాకర రవితేజ వెండి పతకం అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం రవితేజ మంగళవారం మాట్లాడుతూ సిగ్మా అకాడమీ అధ్యక్షుడు ఎంసీ శేఖర్, రాష్ట్ర ఫొటోగ్రఫీ అకాడమీ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు వెండిపతకాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

విద్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు



కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోగిమంట వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



పాఠశాల ఆవరణలో భోగిమంటను వెలిగిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కాజులూరు: మండలంలోని పలు గ్రామాలకు నాలుగు రోజులు ముందుగానే సంక్రాంతి పండగ వచ్చేసింది. మంగళవారం మండలంలోని కాజులూరు, గొల్లపాలెం తదితర గ్రామాలలోని పాఠశాలలలో విద్యార్థులు ముందుగానే సంక్రాంతి పండగను నిర్వహించుకున్నారు. తెలుగు సంస్కృతి, గ్రామీణ పండగలు, సంప్రదాయాలను వివరిస్తూ హరిదాసుల వేషధారణలతో కీర్తనలు ఆలపిస్తూ వినూత్నరీతిలో విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు. సంక్రాంతి పండగ వాతావరణం ఉట్టిపడేలా భోగిమంటలు వేసి గొబ్బెమ్మలు పెట్టి ఆంధ్రా పిండివంటలు తయారు చేశారు. జానపద గేయాలు పాడుతూ భోగిమంట చుట్టూ నృత్యాలు చేశారు. కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పలువురు విద్యార్థులు పోటాపోటీగా ముగ్గులు పెట్టి చూపరులను ఆకర్షించారు. పలువురు స్థానిక అధికారులు, నాయకులు కార్యక్రమాన్ని తిలకించి విద్యార్థులను అభినందించారు. పోటీలలో విజేతలకు కళాశాల పిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.

విద్యార్థుల సందడి

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు సందడి చేశారు. సృజనాత్మకంగా అద్దిన ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి. హరిదాసు, గంగిరెద్దులు వేషధారణల్లో విద్యార్థులు అలరించారు. భోగి మంట వేశారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు శ్రీసిద్ధార్థ కళాశాలల చైర్మన్ వాకా దివ్యశేఖర్, కరస్పాండెంట్ వాకా రాజా, ప్రిన్సిపాల్ పాట్నూరి రమణ, అధ్యాపకులు చేతులు మీదుగా బహుమతులందించారు.

ఆకర్షించిన సెట్టింగులు

మండపేట : పట్టణంలోని మండపేట పబ్లిక్‌స్కూల్ (ఎంపీఎస్)లో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా జరిగాయి. సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు అలరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాల విశిష్టతను చాటిచెబుతూ వేడుకలను ఏర్పాటు చేసిన ఎంపీఎస్ కరస్పాండెంట్ వల్లూరి చిన్నారావును అభినందించారు. వేడుకల్లో భాగంగా పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే విధంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సెట్టింగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హరిదాసులు, కొమ్మదాసులు, కోయదాసులు తదితర సంప్రదాయ కళాకారుల వేషధారణల్లో చిన్నారులు అలరించారు. విద్యార్థినులు ఉత్సాహంగా రంగవల్లుల పోటీల్లో పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలకు చైర్‌పర్సన్ దుర్గారాణి, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, చిన్నారావు అందజేశారు.

అలరించిన వేషధారణలు

రాయవరం: స్థానిక భాష్యం విద్యాసంస్థలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో విద్యార్థుల హరిదాసుల వేషధారణలు అలరించాయి. పాఠశాలలో గొబ్బెమ్మలు పెట్టి, సంప్రదాయ వంటకాలు చేశారు. ప్రిన్సిపాల్స్ పట్నాల శ్రీనివాసగుప్తా, మద్దాల కాంచనల ఆధ్వర్యంలో భోగిమంటలు వేశారు.



అంగర శ్రీసిద్ధార్థ కళాశాలలో అందంగా అద్దిన ముగ్గులతో విద్యార్థినులు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ రాక రేపు

అమలాపురం టౌన్: ఏపీ సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్ గురువారం అమలాపురం రానున్నారు. ఆయన స్థాపించిన అంబేద్కర్ ఇండియా మిషన్ సంస్థ ద్వారా ఎస్సై, కానిస్టేబుళ్ల పోస్టులకు వెళ్లే అభ్యర్థులకు అంబేద్కర్ కమ్యూనిటీ హాలులో గురువారం ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నారు. అభిమానులు, అంబేద్కర్‌వాదులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా కన్వీనర్ జల్లి సుబ్బారావు మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

అధిక దిగుబడులే లక్ష్యంగా రైతుల్లో చైతన్యం

కొత్తపేట: ప్రస్తుత రబీ (దాళ్వా) పంట అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో నీరు, ఎరువులు, పురుగు మందుల వాడకంలో యాజమాన్య పద్ధతులు అవలంబించేలా రైతులను చైతన్యవంతులను చేయాలని వ్యవసాయ శాఖ స్థానిక అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) ఎం.వెంకటరామారావు వీఏఏ, వీహెచ్ఏలకు సూచించారు. దాళ్వా ప్రారంభమైన నేపథ్యంలో వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల వీఏఏ, వీహెచ్ఏలకు కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే పరిధిలో అవసరమైన రసాయన ఎరువులకు ఇండెంట్ పెట్టి రైతులకు సరఫరా చేయడం ద్వారా ఎరువుల కొరత లేకుండా చూడాలని సూచించారు. రసాయన ఎరువులు-ఆర్గానిక్ (సేంద్రియ ఎరువులు), జీవన ఎరువులు సమ్మిళితం చేసి, ఎరువుల యాజమాన్యం చేపట్టి తెగుళ్లు, చీడపీడలు రాకుండా చూడాలని దిశా నిర్దేశం చేశారు.